
# లేడీస్ ఫస్టు

సింగరాజు
రామచంద్రమూర్తి



**పనులన్నీ** పూర్తి చేసుకుని బస్టాండ్ చేరుకున్న నాకు—అక్కడి లైను చూసి కాళ్ళు చల్లబడి పోయాయి. ఒళ్ళంతా చిరాగ్గా ఉండటం చేత చప్పున బస్ దొరుకుతే బాగుండునని, ఇంటికి పోయి స్నానం చేద్దామన్న తొందరలో ఉన్నాను. అటువంటిది ఆంజనేయుడి తోకలా నిలబడి ఉన్న ప్రయాణీకులు నా ఆశని చప్పగా చంపేశారు. మా వూరు చేరుకునేటప్పటికి ఎంతవుతుందో?

వెళ్ళి లైనులో చివరగా నిలబడ్డాను. నా ముందు నిలబడి ఉన్న ఆయన్ని అడిగాను—"చాలసేపు నుంచి బస్సుల్లేవా?" అని.

"అవునండి. గంట దాటింది. అంతక్రితం రెండు బస్సులు వెళ్ళాయిట" అని నవ్వాడు.

ఉసూరు మనిపించింది ప్రాణం. ఎవరో కబుర్లాడుతుంటే బజారులో ఆలస్యం చేశాను. లేకపోతే అవి అందేవి!

అంతలో కళ్ళు చెదిరే రంగుల్లో ఒకవమ్మాయి వచ్చి బుకింగ్ కౌంటర్ దగ్గరకు పోయింది. కనబడుతున్నంత మేరా పొట్ట భాగం చూస్తే ఆమె ఎంత పచ్చని మనిషయినదీ కనబడిపోతోంది. దానికి తగ్గట్టు తన రంగును మరీ పెంచేలా చీర, జాకెట్టు కట్టింది.

కౌంటర్ దగ్గర నిలబడి ఉన్న వాళ్ళలో కదలిక వచ్చి కొంచెంగా ఒదిగి ఆ కిటికీ దగ్గరనే ఆమెకు నిలబడే స్థలం ఇచ్చారు. ఇవ్వకపోతే ఎక్కడ అలిగి వెళ్ళిపోతుందో నన్నట్టు!

నేనూ అలే చూస్తున్నాను. వాళ్ళకి ఆమె పమిట పూర్తిగా రాసుకుంటోంది. జబ్బలు తగులుతున్నాయి. తగలని వాళ్ళు మెత్తని ఆమె వెనక భాగాన్ని చూసి తృప్తి పడుతున్నారు. ఆమె పొట్ట వాళ్ళకి తగులుతుందేమోనని నిశితంగా చూస్తున్నాను నేను.

"గురూగారూ! టికెట్టు తీసుకోమంటారా?"

అనడిగారు ఎవరో నా పక్కన. మైకంలోంచి బయటపడి చూస్తే కిరణ్ కుమార్. "హల్లో" అన్నాను. అతను మా ఆఫీసులోనే పని చేస్తాడు.

"టికెట్ తీసుకోమంటారా?"

"నాకు మీరు తీసుకుంటానంటున్నారా?" అన్నాను, అర్థం కాక.

అత నవ్వి—"ఇలా మీరు నిలబడితే రాత్రికి ఇంటికి చేరరు. తీయించనా?" అన్నాడు.

"మీరయినా ఎలాతీసుకుంటారు?"

"మా వాళ్ళున్నారుగా—అదుగో ఆ ముందు నిలబడింది నా వైఫే' ఆ పూలతోట నాదే నన్నట్టుగా అనిపించింది నాకు. అప్పుడు ఆమె వెనక్కి తిరిగి మాకేసి చూసింది. నేను ఇందాక నుంచి ఆమె ముఖం చూడకపోవడంవలన గుర్తుపట్టలేకపోయాను గాని, ఆమెను నేనెరుగుదును. మా కాలనీలోనే గదా ఇతనుండేది.

"ఒద్దులెండి. థాంక్స్!" అన్నాను. నాది ఒక నియమం. ఆలస్యంగా వచ్చిన వాళ్ళు ముందు నిలబడ్డ వారికి డబ్బిచ్చి టికట్ సంపాయించుకోడం తప్పు అన్నది.

"ఫర్లేదండి!"

"వద్దు మిస్టర్ కిరణ్ కుమార్! ఎక్కడినుంచి వస్తున్నారు?" అన్నాను, ఇక ఆ ప్రస్తావన వద్దన్నట్టుగా.

"తన సిస్టర్ ఇక్కడుంటేను" అని వెళ్ళిపోయాడు.

ఆమె టికట్లు తీసుకుని వెళ్ళిపోయింది. నే నలాగే నిలబడి ఉన్నాను. కాసేపటికి టికట్లయిపోయాయని కిటికీ మూసేశారు. నా ముందింకా పది మంది పైన ఉన్నారు.

"అదేమిటి అన్యాయం?" అన్నాను, పక్కనున్నాయనతో. ఇంకెవరితో అంటే ఎవరు వింటారు?

"వెనక వచ్చిన వారంతా ముందు నిలచిన వాళ్ళ కిచ్చి టికట్టు తీసేసుకుంటున్నారు. వారు వీరికి టికట్టు కొంటే, వీరు వారికి సీటు ఏర్పాటు చేస్తారు. నియమాలున్న వాళ్ళు ఇలా నిలబడిపోతారు" అని నవ్వాడు.

అంతలో బస్ కిటికీలోంచి చేయి వూపుతూ, "రండి, గురువుగారూ!" అని అరిచాడు కిరణ్ కుమార్. ఏమిటా అని బస్ దగ్గరకు వెడితే, "రండి, బస్సెక్కండి ముందు" అన్నాడు.

ఎక్కాను.

"ఇటు రండి, సార్, మీ కోసం సీటుంచాం" అంటూ ముగ్గురు కూర్చునే సీటులోది నాకోటి చూపించాడు. కిటికీ పక్కన ఆ అమ్మాయి, మధ్యన తను.

మాట్లాడకుండా కూర్చున్నాను.

"నాకు తెలుసు, గురువుగారు! మీరు అన్యాయం అయిపోతారని. అందుకనే ఎందుకయినా ఉంటుందని టికట్ తీయించాను" అన్నాడు.

బస్సెక్క గలిగానన్న ఆనందం ఉన్నా ఎందుకో నాకీ పద్ధతి నచ్చదు. అందుకే, "ఇటువంటి పద్ధతులు నాకు నచ్చవు, మిస్టర్ కిరణ్! బస్సెక్క లేకపోతాం. అయినా ఫరవాలేదు. మనం న్యాయంగా ఉన్నామన్న తృప్తి ఉంటుంది. అది ముఖ్యం. ఇప్పుడు చూడండి నాతోపాటు గత గంటగా నిలబడి ఉన్న వారంతా

బయటనే ఉన్నారు. నేను మాత్రం మీ ద్వారా ఎక్కి కూర్చున్నాను. ఇది అన్యాయం కాదూ?'' అన్నాను.

''అలా అనుకుంటే ఎలాగండీ. మిగిలిన వారందరితోపాటు మనముౕను. నేనయినా ఆడవాళ్ళ వెంట ఉండబట్టి. ఆడవాళ్ళ వెంట ఉంటే ఇవి లాభాలు'' అని నవ్వాడు.

''అందరూ చేస్తున్నారని మనం ధర్మం తప్పుతామా?'' అన్నాను.

ఆ అమ్మాయి ఒక సారి నా వంక అదోలా చూసి గభాలున తల తిప్పుకుని కిటికీలోంచి చూడటం మొదలెట్టింది. అతను కూడా ఆ ప్రస్తావన ఆపేసి బయటికి చూడసాగాడు.

తరువాత చాలా కాలంపాటు మళ్ళీ ఆ అమ్మాయి నా కంట పడలేదు. ఆ పైన ఒక రోజున మా కాలనీవారు కిరసనాయిలు పంపిణీ తలబెట్టారు. ఈ కిరసనాయిలు అన్నది ఈ రోజులలో నిత్యావసర వస్తువు. మార్కెట్‌లో అయిపోయింది అనగానే అందరికీ కావాలి— ఉన్నప్పుడు పట్టించుకోకపోయినా!

మా కాలనీ పెద్దలు పట్టవలసిన కాళ్ళు పట్టి కిరసనాయిలు సంపాయించి, తలా ఒక అయిదు లీటర్లు ఇస్తామని అన్నారు. దీనితో ఉన్న అయిదు వందల మందీ తలా ఒక డబ్బా పట్టుకుని లైనులో నిలబడిపోయారు. నేనూ ఆఫీసు వదలగానే వచ్చి లైనులో చివర ప్రాంతాలవాడినయాను. ''ఎప్పటికి బయట పడతాను'' అన్న ప్రశ్నకి ''రాత్రి పదవుతుంది'' అన్నారు పక్కనున్నవారు.

అప్పుడు ఒక డబ్బా పట్టుకుని వచ్చింది కిరణ్ కుమార్ భార్య! లైను ముందు భాగంలో ఉన్నవారిలో సంచలనం కలిగింది. కాసేపు అలా నిలబడి అతి పెద్దవయిన తన కళ్ళను సెర్చి లైట్లు లాగా తిప్పి మగవాళ్ళ లైను కేసి చూసింది. చాలా మంది జాలిపడుతున్నా, చొరవచేసి 'నాకు ఇవ్వండి పోయిస్తాను' అన్నవారు లేరు.

అంతలో సుబ్బారావు గభాలున లైనులోంచి ముందుకొచ్చి, ''ఇటివ్వండి. నేను పోయిస్తాను. చాలా పొడుగు లైను. ఆడవాళ్ళు నిలబడటం కష్టం'' అన్నాడు.

''అబ్బే మీ కెందుకండీ శ్రమ'' అని నవ్వి, ''ఇంత లైనుంటుందనుకో లేదండీ నేను'' అంది.

అతను కూడా నవ్వి ''అవునండీ. కరువు ముందు పుట్టింది మనకన్న. నా కివ్వండి మరేం ఫర్లేదు. ఇప్పుడు మీరు నిలబడితే రాత్రి పదింటికే ఇల్లు చేరడం—ఇబ్బంది కదూ. నా వెనక వాళ్ళెవరూ ఏమీ అనరు లెండీ'' అంటూనే ఆమె చేతిలోంచి డబ్బా అవలీలగా అందుకుని తన పక్కన పెట్టుకున్నాడు.


వెనకనుంచెవరో—''ఇలా సాయాలు చేస్తూంటే మీ వెనకవాళ్ళం వెళ్ళేసరికి పన్నెండవుతుంది'' అన్నారు.

సుబ్బారావు వెనక్కి తిరిగి, ''పాపం, ఆడమనిషి—పోనీ అంతగా ఉంటే నా వంతు మాత్రం మీ దయినాకనే పోయించుకుంటాను. సరా?'' అన్నాడు.

ఆ అమ్మాయి మాత్రం ఆ అన్నాయన వంక ఒక చూపు, సుబ్బారావు వంక నవ్వుతూ ఒక చూపు చూసింది.

అంతా సద్దుమణిగిపోయింది. నాకు ఆ అమ్మాయి తెలివికి ఆశ్చర్యం వేసింది. తనకున్న ఆకర్షణని ఎంత చక్కగా వినియోగించుకుంటోందా? అని.

కొంచెం అవసరముండి, లైనులో నా స్థలాన్ని చూస్తుండమని నేను పక్కనే ఉన్న క్లబ్‌లోకి వెళ్ళాను. అక్కడ కిరణ్‌కుమార్‌ని చూసి ఆశ్చర్యం వేసింది.




''వ్వాట్ మిస్టర్ కిరణ్, మీ ఆవిడ పాపం అక్కడ లైను దగ్గర అవస్థపడుతుంటే మీరిక్కడ పేపరు చదువుకుంటున్నారు'' అన్నాను.

అతను నవ్వి—''ఎలాగోలా మానేజి చేయగలదండీ. ఆడవాళ్ళమీద జాలి ఉంది. మగాళ్ళలో ఎవరో ఒకరు పోయిస్తారు. నేను వెడితే నన్ను చూసి జాలి పడే దెవరు?—రాత్రి పది, పదకొండవుతుంది నేనయితే'' అని పేపరులోకి తల తిప్పేశాడు.

'ఓరి వీడి తెలివి' అని ఆశ్చర్యపోయాను.

నేను మళ్ళీ వెళ్ళేసరికి ''ఇప్పుడే వస్తానండీ'' అని సుబ్బారావుకి చెప్పి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

''వీడు పోయించుకుని ఎదురు చూస్తూ కూర్చోవాలి ఆవిడ కోసం'' అన్నారు నా ముందున్న ఆయన.

''అంత ఉత్సాహంగా తీసుకున్నవాడు ఇంటికి వెళ్ళి ఇవ్వడండీ'' అన్నారు మరొకరు.

మొత్తానికి నేను చేరేసరికి పది దాటింది. ఆ పాటికి వాళ్ళ ఇంట్లో దీపాలు కూడా ఆరిపోయాయి. అతని పద్ధతే బాగుందనిపించింది. తను అలవకుండా పని జరిపి పెడుతోంది ఆ అమ్మాయి. అయినా మగవాళ్ళు ఉన్నంత కాలం, వాళ్ళలో శివశ్రీ ఉన్నంతకాలం ఆ అమ్మాయి కేం ఇబ్బంది?

• • •

ఆ రోజు వరలక్ష్మి వ్రతం. మా ఆవిడ ఉదయాన్నే నాకు అర్డరేసింది— పాలవాడు గేదె తన్నేసిందని కబురంపాడు. వెళ్ళి ఎలాగయినా పాలు తీసుకురమ్మనమని! ఉసూరుమంటూ గవర్నమెంటు పాల కోసం వెళ్ళాను. చూసేసరికి పాలవాను రాలేదుట, లైను మాత్రం ఫర్లాంగుందేమో ననిపించింది! పాలు దొరకడం చాలా కష్టం అని తేలిపోయింది. ఆ పాల బూత్ అతను నన్ను ఎరగడు గదా. నేను రోజూ పోయించుకునే మనిషిని కాను.

అంతలోనే లారీ రావటం, అంతా చీమల్లాగా ఎగబడడం, బూత్ అతను కొప్పడి లైనులో లేకపోతే అసలు పోయనని బెదిరించడం జరిగింది.

''మరి ఆడవాళ్ళకి అలా రాగానే ఇలా ఇచ్చి పారేస్తే మేం ఏమయిపోతాము? మగవాళ్ళు ఎంత మంది ఉన్నారో, ఆడవాళ్ళు ఎంత మంది ఉన్నారో చూసి ఆ నిష్పత్తిలో ఇవ్వండి'' అన్నారు ఒక మాస్టారు.

''ఇవన్నీ చూస్తే మళ్ళీ దీపా లెడతారు'' అని నవ్వారింకోరు. మొత్తానికి ఆడవాళ్ళు మాత్రం చక్కగా శ్రమ లేకుండా తీసుకు వెళ్ళిపోతుంటే ఒళ్ళు మండిపోతూంది నాకు.

అంతలోనే కిరణ్ కుమార్ భార్య వస్తుండటం కనబడింది. నాకు ఆశ కలిగింది. తను సాయం చేస్తే ఒడ్డెక్కుతాను. నా ప్రయోజకత్వం మీద నమ్మకం ఎప్పుడో పోయింది. అందుకని ఆ అమ్మాయి దృష్టిలో పడాలని లైనులోంచి ఒకడుగు పక్కకి వేసి నిలబడ్డాను.

ఒక్కసారి తన విశాలమైన కళ్ళను అలా మగవాళ్ళ లైను మీదుగా ప్రసరింప చేస్తూ నా దగ్గర చూపు ఆపింది.

నేను గుర్తింపుగా వెధవ నవ్వు ఒకటి నవ్వాను.

చటుక్కున తల తిప్పేసుకుని పాల అతని దగ్గరకు వెళ్ళిపోయింది. నా మనస్సు చివుక్కుమంది. అంతలోనే బస్‌లో తను టికెట్ తీసుకోవడం గురించి నేను చెప్పిన నీతి పాఠాలు నాకు గుర్తొచ్చాయి! అప్పుడు అలా అని, ఇప్పుడు ఆమె సహాయం అపేక్షించడం నా తప్పు కాదూ?

తను నిమిషంలో పాలు తీసుకుని వెళ్ళిపోయింది.

మా ఇంట్లో మా ఆవిడ ఎవరింట్లోనో గ్లాసుడు పాలు తెప్పించి పరమాన్నం కాచింది. అక్కడితో పూరుకుంటే బాగానే ఉండేది. ''పూరు వారందరికీ దొరికాయి మీ నాన్న కొక్కరికీ తప్ప'' అంది పిల్లల్తో.

'కిరన్ కుమార్ నువ్వే ప్రయోజకుడివోయ్' అనుకున్నాను మనసులో.

• •

ఒక రోజు క్లబ్‌లో పేపరు చదువుకుంటుంటే వచ్చాడు కిరణ్ కుమార్. ''హలో'' అంటూ విష్ చేసి నా పక్కనే కూర్చున్నాడు.

''ఏమిటి విశేషం?'' అన్నాను, ఏదో ఉందని గ్రహించి.

''మన జి. ఎమ్. గారిని కలుసుకోవాలనుకుంటున్నాను, సార్!'' అన్నాడు.

''మంచిది కలుసుకోండి'' అని మళ్ళీ ''ఎందుకు?'' అనడిగాను.

''పాండురంగారావుగారు రిటైరవుతున్నారు కదా. ఆ పోస్టు నాకు ట్రై చేద్దామని.''

''మీ కన్నా సీనియర్లున్నారేమో'' అన్నాను.

''అందుకేగా కలుసుకోవడం మరి!'' నవ్వాడు. నా తెలివి తక్కువకి నాకు నవ్వు వచ్చింది.

''వెళ్ళమంటారా, మీ సలహా ఏమిటి''

''అయ్యో, తప్పకుండా! పురుష ప్రయత్నం చేయాలిగా — ఇవ్వడం ఇవ్వకపోవడం ఆయన ఇష్టం.''

అతను క్షణం తటపటాయించి— ''అయితే ఇద్దరం కలిసి వెడదామనుకుంటున్నాం'' అన్నాడు.

''అంటే?''

మళ్ళీ నవ్వాడు చిన్నగా. ''అది కాదు

సార్. ఫిమేల్స్‌ని కూడా తీసుకువెడితే కొంచెం జాలిపడే అవకాశం ఉంటుంది. మన మాటకి విలువ పెరుగుతుంది అప్పుడు.''

నాకు నిజంగా చాలా చిరాకేసింది. ఆవిడ అందాన్ని అడ్డం పెట్టుకుని బతకడం బాగా అలవాటయింది వీడికి. అంతలోనే అనిపించింది—అతని ఆలోచనే రైటు, నాదే తప్పేమో ఈ రోజుల్లో అని. ఎంత మంది ఆడవాళ్ళు గాజు బొమ్మల్లాగా అలంకరించుకుని రోడ్ల వెంట తిరగడం లేదూ? వాళ్ళలో ఎంత మంది ఈ విధంగా భర్తలు చేయవలసిన ఇంటిపనులకి తిరుగుతున్న వాళ్ళే వీడిని నేను ఎరుగుదును కనుక విసుక్కుంటున్నాను..అందుకనే—

''తీసుకు వెళ్ళండి-అది మీకు మంచి పని అనుకుంటే చేసేయడమే. యువ తరం—మీదే ఈ లోకం...కాని మన జి. ఎమ్. కి తెలుగు రాదు హిందీ తప్ప. ఈవిడకి హిందీ కాని, ఇంగ్లీషు కాని వచ్చునా?''

''అది కాదు సార్. మాట్లాడటం అంతా నేనే చేస్తాను. పూరికే పక్కన ఉంటే జాలి ఏడే వీలుంటుంది అని. ఆ సీట్లో రాబడి మీకు తెలియనిదేముంది సార్, ఇంటి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. అందుకని...''

''కారీ ఆన్. గుడ్ లక్!''

● ● ●

ఒక వారం పోయాక మెల్లిగా గుసగుసలు బయలుదేరాయి ఆఫీసులో. కిరణ్ కుమార్ ఇంట్లో ఏదో గొడవ జరుగుతోందని. మా ప్యూను ఫకీరు పని కట్టుకుని ఒక్కొక్కరి దగ్గర నిలబడడం, అప్పుడు ''ఏమిటోయ్ విశేషం?'' అని అడుగుతే ''అది కాదు సార్'' అంటూ మొదలుపెట్టడం జరుగుతోంది.

అతను ఆఫీసు టైము కాగానే జి. ఎమ్. గారింట్లో ఉంటాడు. మా స్టాఫ్‌లో చాలా మందికి ఇళ్ళలో ఇస్త్రీ బట్టలు ఉతుకుతాడు. వాళ్ళలో ఈ కిరణ్ కుమార్ ఒకడు.

''ఏమిటోయ్ విశేషం'' అని అడిగాను నా దగ్గర నిలబడగానే.

''తమ రిల్లు కిరణ్‌బాబు గారింటి దగ్గరే కదా సార్ తమరికి తెలియకుండా ఉంటుందా?'' అన్నాడు.

''నా కెలా తెలుస్తుంది చెప్పు చెప్పు'' అన్నాను.

''అదే సార్, ఆ రింట్లో అమ్మగారితో పేచీ వచ్చింది. కుమార్ గారు వారి భార్యగారిని తీసుకుని మన జి. ఎమ్. గారింటికి వెళ్ళారు సార్. అది మీకు తెలుసు కదా!''

''ఊ'' అన్నాను సందిగ్ధంగా బయటపడటం ఇష్టంలేక.

నవ్వాడు. ''అందరికీ తెలుసున్నాన్సార్. అప్పుడు నేను జి. ఎమ్. గారింట్లోనే ఉన్నాను, సార్! జి. ఎమ్. గారు ఆశ్చర్యంగా ముఖం పెట్టారు, సార్! నాకూ ఆశ్చర్యం వేసింది, సార్, వీరిద్దరూ రావడం.

లోపలికి తీసుకెళ్ళి కూర్చోపెట్టానండి ఇద్దరినీ. ఒక నిమిషానికి జి. ఎమ్. గారు బెల్ కొట్టి, ''ఫకీరూ! యు కెన్ గో మాన్'' అన్నారండి.

సరే—వెళ్లమన్నాక మనం వెళ్లిపోవాలి కదండి. మెల్లిగా బయటికి వచ్చి సైకిలు తీసుకున్నానండి. అప్పటికి కుమార్‌గారు ఇంగ్లీషులో ఏదో చెబుతున్నారండి ఆరికి.

నేను సైకిలు తీసుకుని గేటుకాడ కాసేపు తచ్చాడానండి. అంతలో కుమార్ గారు బయటికొచ్చేసి, ''కల్పన హొటల్లో జి. ఎమ్. గారి ఫ్రెండు చటర్జీ అనే ఆయ నున్నాడట ఎ. సి. రూంలో. వారికి, నన్నేమీ అనుకోకుండా—ఈ పాకెట్ ఇచ్చిరమ్మన్నారు, ఫకీరూ'' అన్నాడండి ఆయన.

''నన్నెళ్ళమంటారా, సార్?'' అన్నానండి.

''వద్దులే. నన్ను వెళ్ళమన్నప్పుడు నేనే వెళ్ళాలి. అది మర్యాద'' అని నవ్వుతూ, ''మనం పని మీద వచ్చాం కదా!'' అన్నారు.

''సరే, నే వెడుతున్నాను, సార్'' అని వెళ్ళిపోయానండి. కాని, నాకు మటుకు దిగులుగానే ఉందండి. ఆడమనిషిని ఆలా వదిలేసి వెడుతున్నాడు. అవతల జి. ఎమ్. ఆడ పిచ్చి ఉన్నవాడు. పైగా జి. ఎమ్. గారి ఆడమనిషి ఆరిదేశంలో ఉండిపోయె. అంతలోనే మళ్ళీ బుద్ధి చెప్పుకున్నాను, సార్—ఆరి భార్య గురించి ఆరికి లేని దిగులు నా కెందుకు?'' అని.

నే వెళ్ళిపోయి మన హొటల్లో టీ తాగుదామని అక్కడే కబుర్లలో పడిపోయానండి. నేను జి. ఎమ్. గారిల్లు వదలడం ఏడింటికండి. టంచనుగా ఎనిమిదికి కుమార్‌గారు, వారి భార్యగారు రిక్షాలో రావడం కనబడింది, సార్! నన్నారు చూడలేదండి. ఎందుకో ఆయమ్మ ఏడుస్తోందనిపించిందండి నాకు. ఎదవ పాణం ఆగక సైకిల్ తీసుకుని వారి వెంటే బయలుదేరానండి.

రిక్షాలోంచి వారి ఘర్షణ వినబడుతోందండి—''ఏం చేశాడో చెప్పు. నేనేమీ అనను'' అంటున్నారండి కుమార్ గారు.

ఆవిడ వెక్కి వెక్కి ఏడుస్తూ, ''చెప్పానుగా, నా మాట నమ్మండి. అంతే, ఇంకేమీ జరగలేదు!'' అందండి.

''లేదు. నిజం చెప్పు. అంత సేపు పూరికే చేతులు పట్టుకుని పూరుకుంటాడా?''

''మీ మీద ఒట్టు. కాసేపు పూరుకోండి. రిక్షా దిగాక మాట్లాడుకుందాం.

నాకు ఆశ్చర్యం వేసిందండి. ఇదేదో విషయంగా ఉందనిపించి మర్నాడు జి. ఎమ్. గారి వంట మనిషిని కదిపానండి. వీడూ వారి దేశంవాడే కదండి. వాడు చెప్పాడండి. అస లేం జరిగిందంటే...

కుమార్‌గారు వెళ్ళగానే జి. ఎమ్. గారు వంట ఇంటి తలుపు వేసేశారుటండి. ఫ్రిజ్ తీసి ఒక చుక్క తాగారుటండి. తరువాత వెళ్ళిపోయి కుమార్‌గారి భార్య చేయి పట్టుకున్నారుటండి.

ఆవిడ తెల్లబోయి—''సార్, సార్'' అందిటండి.

ఈయన ఇంగ్లీషులో—''పర్లేదు—మీ ఆయనని పనిమీద పంపేశాను. అవతల మనిషికి ఫోనులో చెప్పేశాను, ఇప్పుడిప్పుడే వాడిని వదలద్దని. భయం లేదు'' అన్నారుట. అంటూనే వాటేసుకుని ఆరిని ఎత్తేశారుటండి. అంత పెద్దమనిషి కదండి ఆయన.

ఆవిడ పెద్దగా, ''సార్, సార్...నేను... నేను'' అంటుందిటండి.

ఆయన వినే స్థితిలో లేరుటండి—''ఏమిటలా తిరగబడతావు? ఇందుక్కాకపోతే మీ ఆయ నసలు నిన్నెందుకు తెచ్చినట్టు? బయటికి వెళ్ళమనగానే వెళ్ళిపోతే అర్థం ఏమిటి?'' అని అంటూనే బెడ్‌రూంలోకి ఆవిడని ఎత్తుకెళ్ళిపోయాడుటండి.

వంటాయన కిటికీలోంచి చూసి నవ్వుకున్నాడుటండి. అది కిని అల వాటయిన సీన్లేటండి!

అంతలోనే లాగి చెంపమీద కొట్టిన శబ్దం వినబడి, క్షణంలో ఆ అమ్మగారు విస్సురుగా గదిలోంచి పారిపోయి బయటికొచ్చేసిందిటండి. ఏడుస్తోందిటండి. మనిషి నలిగిపోయి, జుట్టంత చీదర చీదరగా ఉందిటండి.

వాకిలి వరండాలో రోడ్డు కెదురుగ్గా కూర్చుని ఏడుస్తోందిటండి.

జి. ఎమ్. గారు గభాలున బెడ్‌రూం తలుపు లేసేసుకున్నారుటండి.

కాసేపటికి కుమార్ బాబు రాగానే ఆయనమీద పడి భోరున ఏడ్చేసిందిటండి ఆవిడ—''నన్నింత అన్యాయం చేస్తావా, ఆ వెధవకి నన్నప్పజెప్పి పోతావా'' అని.

ఇదుగో అక్కడినుంచి మొదలయిందన్నమాట ప్రశ్న—''అస లేం జరిగింది చెప్పు'' అని ఆయన, ''ఏం లేదు—నన్నెత్తుకుని బెడ్‌మీద పడేశాడు, లాగి కళ్ళు బైర్లు కమ్మేలా కొట్టి పారిపోయొచ్చేశాను'' అని ఆవిడ.

''ఇంతసేపు పట్టింది. నువ్వు చూడబోతే ఇలా ఉన్నావు. ఇంకా ఏదో జరిగి ఉండాలి, నేనేమీ అనను'' అని మళ్ళీ ఆయన—

మర్నాడు నేను పనిగట్టుకుని రేవుకని వెళ్ళానండి కుమార్‌బాబు ఇంటికి.

ఆమెగారి ముఖం ఎర్రబడిపోయి ఉందండి, ఏడిచి ఏడిచి. ఆయన సీరియస్‌గా ఉన్నారండి. ''దేవుడి సాక్షిగా నన్ను నమ్మండి'' అంటున్నరండి నే వెళ్ళేసరికి. నన్ను చూసి, ''బట్టలేవు—వెళ్ళు'' అన్నారండి కుమార్‌గారు.

ఇంటి పక్కోరు కూడా చెప్పినారండి—''పొద్దస్తమానం—ఏం జరిగింది ఏం జరిగింది?'' అని అడుగుతాడుటండి. ఆరికి ఏదో జరిగిపోయింది, అన్న అనుమానం బ్రహ్మరాక్షసిలా పట్టుకుని పీడిస్తోందండి.'' ముగించాడు ఫకీరు.

నాకు జాలేసింది, అనవసరంగా ఇబ్బందుల్లో పడ్డాడని.

మొత్తానికి ఆ తరువాత ఆ అమ్మాయిని వెంటేసుకుని తిరగడం మానేశాడు. ఇంటిపనులన్నీ స్వయంగా తానే చేసుకుంటున్నాడు ఇప్పుడు. *

